


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఏం చేస్తున్నారూ?

**ప్రొద్దుట పూట హడావుడిగా పనిచేసుకుంటుంటే ఫోన్ వస్తుంది.** నా సెల్ ఫోన్ అయితే నేనే తీస్తాను. కానీ పిల్లల ఫోన్ అయినా, కామన్‌గా ఉన్న లాండ్ లైన్ అయినా కూడా నేనే తియ్యాలి. అదెంత లబలబలాడినా ఎవరూ పట్టించుకోరు. మొదట్లో నేనూ ఓపిగ్గా తీసేదాన్ని, కానీ కొంతకాలంగా లాండ్ లైన్‌కి వచ్చే ఫోన్స్ అన్నీ రియల్ ఎస్టేట్స్ వాళ్ళ దగ్గర నుండో, ఏదో క్లబ్ మెంబర్ షిప్ గురించనో, ఎవరో హోమియోపతీ డాక్టర్ క్లినిక్ నుండో, "కొత్త పత్రిక పెట్టాం, మీకు ఉచితంగా మూడు సంచికలు పంపాం ఎప్పుడు సబ్‌స్క్రైబ్ చేస్తున్నారు" అనో, ఈ మోస్తరు ఫోన్లు వస్తుంటే, తియ్యడం మానేసాను.

సాధారణంగా, బిజీగా ఉన్నప్పుడు, సావకాశంగా అవతలి వాళ్ళు కుశల ప్రశ్నలు వేస్తుంటే ఒళ్ళుమండుతుంది కదా! కానీ అవతలి వాళ్ళకి మనం బిజీగా ఉన్నామని ఎలా తెలుస్తుందీ? తెలియదు కాక తెలియదు. అందుకే వాళ్ళు ఇలా సంభాషణ మొదలు పెడతారు.

"హలో.."

"హలో"

"బలభద్రుని రమణిగారేనా అండీ?"

"బలభద్రపాత్రుని రమణిని.. చెప్పండీ"

"అదేలెండి.. మీ పేరు చాలా పొడుగు.. పలకడం కష్టం.. అయినా అలా ఎందుకు పెట్టుకున్నారండీ?"

"నేను పెట్టుకోలేదు. అది మా ఇంటి పేరు... చెప్పండీ."

"మీ ఇంటి పేరంటే మీ ఆయన ఇంటి పేరా, మీ అమ్మగారిదా? అండీ?"

"మా ఇంటిపేరంటే, పెళ్ళయ్యాక వచ్చిందేగా మా జనరేషన్‌లో... చెప్పండి... మీరెవరు? నాతో ఏం పనీ?"

"నా పేరు సుబ్బలక్ష్మి అండీ.. బి.హెచ్.ఇ.యల్ నుండి ఫోన్ చేస్తున్నానండీ.."

"మంచిది. ఏం పని మీద చేసారూ?

"మీరు నవలలు రాస్తారు కదండీ.."

"అనుకుంటున్నాను.. మీరేమైనా చదివారా?"

"లేదండీ నవ్య పత్రికలో మీ నెంబర్ చూసాను. అప్పటి నుండీ ఫోన్ చేద్దామని"

"నా నవలలు ఏవీ చదవలేదా? మరి ఎందుకు ఫోన్ చేసినట్లూ?" (ఇక్కడ నా కంఠం కొంచెం విసుగ్గా మారుతుంది.)

"ఊరికే పలకరిద్దామని.. ఇప్పుడేం చేస్తున్నారూ?"

"బండ పచ్చడి చేద్దామని, వంకాయ కాలుస్తున్నాను.. బాగా కాలింది..."

"అహోహోహో.. మీరు భలే తమాషాగా మాట్లాడ్తారండీ.. ఇప్పుడేం చేస్తున్నారంటే, ఏం రాస్తున్నారనీ?"

వెంటనే ఆటా మహాసభల్లో మహానుభావులు గరికపాటి నరసింహారావుగారు అష్టావధానంలో చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"నేను ఇంతకు ముందు పాతిక నవలలూ, నూట యాభై కథలూ, చాలా కాలమ్స్, సీరియల్స్, సినిమాలూ రాసాను. కొన్నైనా చదివారా? చూసారా? కనీసం నా పేరైనా పూర్తిగా తెలీదు మీకు. నేను ఇప్పుడు ఏం రాస్తే మీకెదుకండీ? రోజూ తలకి నూనె రాసుకుంటాను. చాకలి పద్దు రాస్తాను. మీకెందుకండీ? ప్రొద్దుట 8.30 అయింది. మంచి పనివేళ. బహుశా మీకు పనీపాటా ఉండి ఉండదు. ఇలా ముక్కూ మొహం తెలీని వాళ్ళ నెంబరు పత్రికలో చూసి, తీరిగ్గా పోచుకోలు కబుర్లు మొదలు పెట్టారు. నాకు అలా కాదు. బోలెడు పనులు ఉంటాయి. మీరు ఫోన్ పెట్టేస్తే మిక్సీలో పచ్చడి రుబ్బుకుంటాను. మళ్ళీ కరెంట్ పోతే, మూడు గంటలు రాదు" అని చెప్పాలని ఉంటుంది. కానీ మర్యాదగా "ఇహిహీ.. మళ్ళీ తీరిగ్గా ఉన్నప్పుడు మాట్లాడదామే!" అని పెట్టేస్తాను.

ఇలా రైల్వే స్టేషన్లలో, బస్ స్టాపుల్లో, పేరంటాలలో, పెళ్ళిళ్ళలో, టీ.వీ ఇంటర్వ్యూలో ఎక్కడ పడితే అక్కడ, "ఏం చేస్తున్నారూ?" అనే ప్రశ్న వేస్తూనే ఉంటారు.

గరికపాటి నరసింహారావుగారు ఏమన్నారంటే ఈ ప్రశ్న వేసినప్పుడల్లా, రచయితలు గిల్టీగా ఫీలయి, ఏదో ఒకటి రాయాలేమో అని, గబగబా పేపర్లు తీసుకుని నానా చెత్తా బరబరా గీకి పారేస్తారట. ఇలా సాహిత్యం భ్రష్టు పట్టించడానికి కాకపోతే, ఆవలిస్తూ, ఇలాంటి ప్రశ్నలు ఎందుకు చెప్పండీ?

అవతలి వాళ్ళు కాస్త ప్రముఖులైతే చాలు ఏం చేస్తున్నారూ" అనే ప్రశ్న.

ఏం వాళ్ళకి ఖాళీగా కూర్చునే హక్కులేదా? కొంతమందికి అవకాశాలు రావు. కొంతమందికి మూడ్ వస్తే కానీ రాయరు. కొంత మంది వేరే వ్యాపకాలలో బిజీ అయిపోతారు. ఇంకా కొంత మందికి నాలా బద్దకం! అయితే వీళ్ళకెందుకంట? మేము గిల్టీగా ఫీలయి సంజాయిషీలు ఎందుకు ఇచ్చుకోవాలి అంట?

ఇంక ఫోన్ సంభాషణల విషయానికొస్తే, రేడియోలలో, టీ.వీ.లలో కాలర్స్ ఇంటరాక్షన్ కోసం, మీరు ఫోన్ చెయ్యాల్సిన నెంబర్లు అని అక్కడ ఇస్తూ ఉంటారు. అది చూసి ఏ సెలూన్ లో నుండో ఒకరు ఫోన్ చేస్తారు..

"హలో..."

"హలో.."

"ఇదే ప్రోగ్రామ్ అండీ?"

"`ఎప్పుడో ఎక్కడో` ప్రోగ్రామ్ అండీ.. మీరు వింటున్నారా? మీ రేడియో వాల్యూం కొంచెం తగ్గించండి"

"ఎప్పుడో ఎక్కడో ప్రోగ్రామా? దేని గురించండీ ఈ తొక్కలో ప్రోగ్రాం?"

అవతలి ఏంకర్ ఓ క్షణం నిశ్చేష్టుడై, తట్టుకుని,

"ఇది చాలా కాలంగా దూరంగా ఉన్న స్నేహితుల్ని కలిపే ప్రోగ్రాం అండీ.."

"అయితే తాటిమందలో ఉన్న మా బైరి నాగేశ్వరమ్మని కలుపు ఓ పాలి.. మాట్లాడాలి"

"ఓ, తాటి మందలో మీ స్నేహితురాలుందా? మీ పేరూ వివరాలూ చెప్పండీ.. మేం రేడియోలో చెప్తాం.. ఆవిడ వింటే, మీ ఫోన్ నెంబర్కి ఫోన్ చేస్తారు.."

"నా పేరు పాపారావండీ.. అదెందుకు చేస్తుందండీ? దాని మొగుడు తంతాడు. అది ఎనిమిదో క్లాసులో నాతో వచ్చేస్తే, వాళ్ళింట్లో వాళ్ళు తీసుకుపోయి మిద్దింటి గోపాలం గాడికిచ్చి పెళ్ళి చేసారు. వాడికీ నాకూ చిన్నప్పటినుండీ పడదు. గోళీలాడేటప్పుడే తొండి చేసేవాడు. ఎదవ.. ఎదవన్నరెదవ.. అసలు ఇంకోడు ఉండేవాడండీ బుడుగుపాలెం సత్యన్నారాయణ మూర్తనీ.."

"చాలా విషయాలు చెప్పారండీ పాపారావుగారూ మళ్ళీ వచ్చేవారం కలుద్దాం. మీ స్నేహితురాలు మీతో మాట్లాడవచ్చు. నమస్కారం.. బై!"

"ఇదిగోనండి. సెప్పేది సాంతం వినండి.. దానికి నేనో పగడం ఉంగరం తొడిగాను. ఎనక్కి ఇచ్చెయ్యమనండి. ఇదిగో.. ఇదిగో.."

ఇలా ఉంటాయి కొన్ని ప్రోగ్రాంలు. ఇంక ఈ మధ్య తరచుగా ఇంటర్నెట్ రేడియో టోరీ వింటున్నాను.

దాంటో మా డొక్కా ఫణి కమ్మని కంఠంతో 'అనగా అనగా'లో కథ చదివి, శ్రోతలతో ఇష్టాగోష్ఠి చెయ్యాలనుకుంటాడు. అప్పుడు ఫోన్స్ వస్తాయి.

"హలో.."

"హలో.. ఎవరు మాట్లాడుతున్నారండీ?"

"నేను..."

"నేనంటే.. పేరు చెప్పాలి.."

"అదే ఎప్పుడూ చేస్తా కదండీ.. ఫలానా"

"ఓ.. ఫలానాగారా? బావున్నారా?"

"అబ్బే.. ఆఫీస్‌కి వెళ్ళిపోయారండీ.." (ఇది ఫణి జోకే!)

"అది కాదండీ.. మీరు బావున్నారా అని అడిగాను. ప్రోగ్రాం విన్నారా అండీ?"

"ఊ.."

"ప్రోగ్రాంలో వాన గురించి మాట్లాడుకున్నాం. చక్కగా మీ చిన్నప్పటి కబుర్లు బోలెడు గుర్తొచ్చి ఉంటాయి. ఔనా?"

"ఊ.."

"ఏవీ కొన్ని చెప్పండి సరదాగా వాన వస్తున్నప్పుడు అమ్మని వేడి వేడి పకోడీలు చెయ్యమని అడగడం. మొక్కజొన్న పొత్తులు కుంపటి మీద కాల్చుకుని తినడం, వేరు శనగకాయలు తంపటేసుకుని తినడం, వేడి వేడి మిర్చి బజ్జీలు తినడం, కిటికీలోంచి వానని చూడడం, కాయితపు పడవలు చేసి నీళ్ళలో వెయ్యడం ఇలాంటివి.. కదూ!"

"ఊ.."

"మరి ఏవైనా చెప్పండి కొన్ని."

"మీ ఆవిడ బావుందా?"

(సడెన్‌గా ఈ ప్రశ్నకి ఫణి తల తడుముకుంటాడు.. భుజాలు తడుముకోలేక.)

"ఆ బావుంది. మీరు వాన బాగా ఎంజాయ్ చేస్తారనుకుంటాను."

"ఊ.."

"మీ వారూ పిల్లలూ కూడా బాగా ఎంజాయ్ చేస్తారా?"

"ఊ.."

"సరే... ఆనక 'ఊ' కొట్టుకుందాం. ఇంకా బోలెడు మంది కాలర్స్ వెయిట్ చేస్తున్నారేం నమస్కారం."

"ఊ.."

(ఊరికే సరదాగా నేనూ ఫణీ నవ్వుకునే మాటలు కొన్ని ఇక్కడ రాసాను. ఎవర్నీ ఉద్దేశించి కాదు. అందర్నీ ఉద్దేశించి.)

ఇలా సిగ్గుపడిపోతు, మాటలు రానట్లు మూగనోము పట్టేవాళ్ళు అసలెందుకు ఫోన్లు చేస్తారో అర్ధంకాదు.. అన్నీ ఏంకర్లే మాట్లాడాలి. వీళ్ళు 'ఊ కొడ్తారు' అంతే!

వీళ్ళు ఫోన్ చెయ్యకపోతే చక్కగా మాట్లాడే ఇంకొకరికి అవకాశం వస్తుంది కదా పాపం.

ఇంకోసారి విరిజల్లులో అమెరికా వచ్చినప్పుడు కిరణ్‌ప్రభగారు నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నప్పుడు విన్నాను.

"మీరు కాల్ చేసి బలభద్రపాత్రుని రమణిగారితో మాట్లాడచ్చు... ఇదిగో ఎవరో కాలర్ అప్పుడే చేస్తున్నారు.. హలో.."

"హలో.. కిరణ్‌ప్రభగారాండీ?"

"ఆ.. కిరణ్‌ప్రభనే.. ఇదిగోండి బలభద్రపాత్రుని రమణిగారితో మాట్లాడండి.."

"ఒద్దు సార్..మీతోనే మాట్లాడ్తా."

"అది కాదండీ. . ఈ ప్రోగ్రాం.."

"సార్... ఈ రోజుల్లో పిల్లలు ఎందుకిలా పాడైపోతున్నారు. షార్.. నేను.. షూస్తున్నాను.. షూస్తూనే.. ఉన్నాను.. (ఈ గ్యాప్‌లో ఇంకో క్వార్టర్ పాకెట్‌లోంచి తీసి కొట్టేసి ఉంటాడు) షిన్నప్పుడు నాగేశ్వ్రరావు షినిమాలే ఎక్కువ షూసేవాడ్ని. ఇప్పుడు షెత్త.. షెత్త సినిమాలొస్తున్నాయి.."

కిరణ్‌ప్రభగారు అనుభవజ్ఞులైన ఇంటర్వ్యూయర్ కాబట్టి, లైన్ కట్ చేసి "లైన్ కట్ అయింది సాంకేతిక లోపం వల్ల ఇంకో కాలర్‌ని చూద్దాం" అనేసారు.

ఇలా ఉంటాయి కొన్ని లైవ్ ప్రోగ్రామ్స్.

అదే మా అమ్మ అయితే నేను ఏ టీ.వీ ఛానెల్‌లోనో ఉంటే ఫోన్ చేసి "హలో .. నేను సత్యవతిని.. పంజగుట్టనుంచి ... రమణితో.. అదే రమణిగారితో మాట్లాడాలి.."

(ఇంట్లో చెప్తాను. ఒకవేళ ఫోన్ చేసినా, నేను కూతుర్ననీ, తను అమ్మననీ చెప్పకూడదని.)

నేను: "హలో సత్యవతిగారూ, బావున్నారా?

**అమ్మ:** ఆ.. ఏదో ఇలా ఉన్నాం. పెద్ద వయసు కదండీ.. పిల్లలు పట్టించుకోరు.. అన్నీ వాళ్ళకే తెలుసన్నట్లు మాట్లాడ్తారు. మా కాలంలో మేమూ ఉజ్జోగాలు చేసాం. మాకూ బోలెడన్ని తెలుసు. కానీ...

(నాకూ మా అన్నయ్యకీ ఈ విసుర్లన్నీ అని తెలిసి నేను కొంచెం జాగ్రత్త పడ్డాను.)

**నేను:** ఇంకేవిటి విశేషాలు? నవలలూ అవీ చదువుతారా?

**అమ్మ:** నవలలు చదవను... అవీ ఇవీ చదువుతాను.

**నేను:** సరే సినిమాలు చూస్తారా?

**అమ్మ:** దిక్కుమాలిన సినిమాలు తల నెప్పండీ బాబూ!

**నేను:** పోనీ సీరియల్స్ చూస్తారా?

**అమ్మ:** మా అమ్మాయి తిడ్తుంది. నేను ఏం చేసినా సీరియల్స్ చూసే అంటుంది.

**నేను:** సరే.. అయితే బాగా మాట్లాడారమ్మా.. మళ్ళీ కలుద్దాం.. నమస్కారం.

**అమ్మ:** అదికాదే.. మధ్యాహ్నం వచ్చేటప్పుడు గుమ్మడికాయ వడియాలు పట్టుకు రమ్మంటావా? అది అడుగుదామనే అసలు ఫోన్ చేసాను. నీ సెల్‌ఫోన్‌కి చేస్తే లైన్ దొరకట్లేదు.

(అది ఇలా తుస్సుమంటుంది.)

నిన్ననే ఒకళ్ళు అడిగారు నన్ను. "ఏం చేస్తున్నారీమధ్య?"

"నేను ప్రస్తుతం సెన్సార్ బోర్డ్ మెంబర్ గా ఉన్నాను."

"అది సరే.. ఏం రాస్తున్నారనీ?"

"ఇంక రాయడానికి టైం లేదు.. అదే చేస్తున్నాను"

"అదేవిటి? ఏ నెలకో వారానికో ఓ సినిమాకి పిలుస్తారు. దానివల్ల రాయడం మానెయ్యడం ఏవిటీ?"

"అదే మరీ! ఓ సినిమాకి పిలుస్తున్నారు.. మేం చూసి బోలెడన్ని కట్స్ పెడుతున్నాం. అవి అన్యాయం అంటూ వాళ్ళు రివిజన్ కమిటీకి వెళ్తారు.... వెళ్ళాకా తక్కువ కట్స్ రావచ్చేమో కానీ రిలీజయ్యాకా ఎవరు చేసారీ సెన్సార్? ఫలానా ప్రాంతం వాళ్ళ స్లాంగ్ వాడారు. వాళ్ళ మనోభావాలు దెబ్బతిన్నాయి అని గొడవ చేస్తారు. మా అందరి దిష్టిబొమ్మలూ తగలపెడ్తారు. ఒక వేళ వాళ్ళు R.Cకి వెళ్ళక పోతే, మొత్తం 94 కట్లు పెడితే వాళ్ళు అమలు చేసారా లేదా అని మళ్ళీ మేమే మొదటి నుండీ చూడాలి. ఒకటో రెండో వాళ్ళు నొక్కేస్తారు. దాంతో మళ్ళీ మేం సర్టిఫికెట్ నొక్కి పెడ్తాం, వెళ్ళి మళ్ళీ వాళ్ళు చేసి తీసుకొస్తే, మళ్ళీ మేమే చూడాలి. ఇలా ఒకొక్క సినిమా మూడు మూడు సార్లు చూస్తూ, ఇల్లూ వాకిలీ మర్చిపోయి సేవ చేస్తుంటే, టీ.వీ.ల్లో చర్చలూ, సెన్సార్ బోర్డు వేస్ట్.. సభ్యులు నిద్రపోతున్నారా? అంటూ దుమ్మెత్తి పోయడం. వీటితో బిజీగా ఉంటామండీ.. ఇంకేం రాయడం నా బొందా?" అనేసాను.

అసలు నా మటుకూ నాకు "ఏం చేస్తున్నారు?" అని అడిగితే ఈ మధ్య ఏం చెయ్యడంలేదండీ.. హాయిగా పడుకుని స్టార్ వరల్డ్‌లో 'గ్రేస్ ఎనాటమీ', కలర్స్‌లో 'బిగ్ బాస్', సోనీలో 'బడీ అచ్చీ లగతీ హై, ఈ టీ.వీలో 'పాడుతా తీయగా చూస్తున్నాను. ఇంకా టైం మిగిలితే నెట్‌లో పనికిరాని సైట్లు బోలెడూ! ఫేస్‌బుక్‌లోకి వెళ్ళామా పోచుకోలు ముచ్చట్లకి కొదవే లేదు. హాయిగా గంటలు గంటలు గడిచిపోతుంది" అని చెప్పాలనిపిస్తుంది. చెప్తాను కూడా! సిగ్గు పడను. కానీ, ఫేస్ బుక్ వల్ల కొన్ని ఉపయోగాలు కూడా ఉన్నాయి.

మొదటివి వంటలు. కొంతమంది దగ్గరనుంచి మంచి వంటలు నేర్చుకున్నాను.

రెండవదీ, అతి ముఖ్యమైనదీ, పెళ్ళి సంబంధాలు. ఏ అమ్మాయి సంబంధం అయినా, అబ్బాయి సంబంధం అయినా వస్తే వాళ్ళ ఇంటికెళ్ళి, ఫలహారాలు మింగి అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేసి వాళ్ళని ఎంబరాస్ చెయ్యక్కరలేకుండా, ఆ అమ్మాయి ప్రొఫైల్ చూసి, ఆమె గురించీ, లేక అతడి గురించీ తెలుసుకోవచ్చు. కొన్ని సార్లు అబ్బాయిలకి వాళ్ళ పక్కన ఉన్న దగ్గర స్నేహితుల మాజీ గర్ల్ ఫ్రెండ్స్ అని తెలిస్తే, ఆ అమ్మాయిని తప్పించుకోవచ్చు కూడా.

అలాగే మనం మన చుట్టాల ఇళ్ళలో విషయాలన్నీ ఫోన్ ఖర్చు లేకుండా, వెళ్ళక్కర లేకుండా గంట గంటకీ (కొంత మంది అయితే ఐదు నిమిషాలకో స్టేటస్ అప్‌డేట్ పెడ్తారు) తెలుసుకోవచ్చు. వాళ్ళ శుభాల్లో పంచుకోవచ్చు. అశుభాలకి సంతాపాలూ తెలియజేయవచ్చు.

ప్రముఖ సినీ రచయిత సత్యానంద్‌గారు ఓ జోక్ పెట్టారు. ఈ ఫేస్‌బుక్ కనక బ్యాన్ చేస్తే, జనం అలవాటయిపోయి పిచ్చెక్కినట్లు, ఫోటోలు చేతుల్లో పట్టుకుని, రోడ్ల మీద "డూ యూ లైక్ దిస్?" అని తిరుగుతూ ఉంటారట.

ఇదంతా "ఏం చేస్తున్నారి మధ్యా? " అని నిన్న ఓ పెళ్ళిలో ఒకరు అడగడంతో రాయాలనిపించింది.

"చూస్తున్నారుగా.. పెళ్ళిళ్ళకి అటెండ్ అవుతున్నాను ఈ మధ్య" అన్నాను.

నిజంగా ఈ మధ్య ఆగస్ట్ నుండీ పెళ్ళిళ్ళే పెళ్ళిళ్ళు.

"ఇంకేం చేస్తాం చెప్పండీ?"

"ఇంతకీ మీరేం చేస్తున్నారూ?"

(పోచుకోలు కబుర్లు చదువుతున్నా అని మాత్రం చెప్పకండేం... ప్లీజ్.)

●●●

Click here to share your comments on this story.

